క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బ్రహ్మం తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పొదిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధికారులతో సమీక్షిస్తారని ఎంపీడీఓ గుత్తా శోభన్‌బాబు తెలిపారు. అన్ని శాఖలకు అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది పూర్తి వివరాలతో హాజరు కావాలని సూచించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు.

1న గంగమ్మ, గౌరమ్మ నిమజ్జనం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు పూజలందుకున్న గంగమ్మ, గౌరమ్మను కె.ఎస్.పల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సగిలేరులో డిసెంబర్ 1న నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద యాదవ వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వీఆర్‌ఏల సంక్షేమానికి కృషి


లక్ష్మయ్యను అభినందిస్తున్న వీఆర్‌ఏలు

మార్కాపురం రూరల్: వీఆర్‌ఏల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా వీఆర్‌ఏల సంఘ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన నాలి లక్ష్మయ్య తెలిపారు. జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన లక్ష్మయ్యను గురువారం స్థానిక వీఆర్‌ఏలు అభినందించారు. ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో మార్కాపురం డివిజన్‌కు చెందిన సీహెచ్ చెన్నయ్యను ఉపాధ్యక్షుడిగా, జి.రంగారావు, మోసెస్‌ను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు నిర్మించాలి


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డీఈ సుబ్బారెడ్డి

కొమరోలు: సీసీ రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని గిద్దలూరు పంచాయతీరాజ్ డీఈ ఎస్.వి.సుబ్బారెడ్డి సూచించారు. కొమరోలు పరిధిలోని పురుషోత్తమునిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. రూ.40 లక్షలతో 600 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ వీరయ్య ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామచంద్రరావు

మార్కాపురం టౌన్: పట్టణంలోని షిరిడీ సాయి సత్సంగ మందిరం ఆధ్వర్యంలో సుమారు 100 మంది పేదలు, వృద్ధులు, అనాథలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆర్ రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సాయి బాబా సూక్తులు పాటిస్తూ ఆపదలో ఉన్న వారిని, పేదలను ఆదుకోవాలని సూచించారు.

దుస్థితిలో ముసి ఆనకట్ట!

- ఇసుక మేటలతో నిలిచిన సాగు నీటి పథకం
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- బీడు భూములుగా మారిన 1200 ఎకరాలు
- మరమ్మతులు చేస్తే 6 గ్రామాల రైతులకు ప్రయోజనం


నీరు లేక ఎండిన ముసి

పొదిలిరూరల్: రైతుల అమాయకత్వం.. అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరి వెరసి ఓ సాగునీటి పథకం నిరుపయోగంగా మారింది. పొలాలకు సాగు నీరు అందించాల్సిన ముసి వాగు ఇసుక మేటలతో పూడిపోయింది. దీంతో ఈ పథకం ఆయకట్టు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

పొదిలి మండలంలోని తలమళ్ల గ్రామానికి ఉత్తరం వైపున దాదాపు 29 ఏళ్ల క్రితం రూ.1.2 కోట్ల నాబార్డు నిధులతో ముసి వాగుపై ఆనకట్ట నిర్మించారు. దాదాపు 13 కిలోమీటర్ల దూరం ప్రధాన కాలువ ఏర్పాటు చేశారు. అయితే పూర్తి స్థాయిలో కాలువ పనులు చేపట్టకపోవడంతో పథకం ముఖ్య ఉద్దేశం నెరవేరలేదు. పొదిలి మండలంలోని తలమళ్ల, గోగినేనివారిపాలెం, ఉప్పలపాడు, ఏలూరు, సల్లూరు, నల్లారెడ్డిపాలెం, మర్రిపూడి మండలంలోని చిలంకూరు గ్రామాల పరిధిలో 1200 ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయడమే ఈ పథకం ఉద్దేశం. కాలక్రమంలో ఆనకట్ట వద్ద ఇసుక మేటలు వేయడంతో సాగునీరు అందించేందుకు వీల్లేకుండా పోయింది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పథకం పూర్తిగా మూలన పడింది. ఈ ఆనకట్టకు మరమ్మతులు చేపడితే బీడుగా మారిన 1200 ఎకరాల భూములను సస్యశ్యామలం చేయవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

ఇసుక మేటలు తొలగిస్తేనే..

ఆనకట్ట లోపల భాగం ఎత్తును మించి ఇసుక మేటలు వేయడం, చిల్లచెట్లు భారీగా పెరగడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. అప్పట్లో ఆనకట్టను 3.6 మీటర్ల ఎత్తు, 170 మీటర్ల పొడవున నిర్మించారు. ఈ ఆనకట్ట తూర్పువైపు నుంచి నిత్యం ఇసుక మాఫియాతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఇళ్ల నిర్మాణానికి ఇసుక తీసుకెళ్తున్నారు. కానీ ఆనకట్ట లోపల ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంది. పాలకులు స్పందించి ఇసుక మేటలు తొలగించడంతోపాటు ఆనకట్టను అభివృద్ధి చేసి సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరు గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోటార్లు ఉంటేనే పంటలు పండుతాయి

మా పొలాలకు కాలువ పక్కనున్న మోటారు పెట్టనిదే భూమికి నీరు అందించలేం. కాలువ లోతు ఉండటం వల్ల భూమి పైభాగంలోకి నీరు వచ్చే మార్గం లేదు.

– సూరపురాజ్, తలమళ్ల

కాలువ మరమ్మతులు చేస్తే కష్టాలు తగ్గుతాయి



కాలువలో పూడిక తీసి మరమ్మతులు చేస్తే సాగునీటి కష్టాలు తీరుతాయి. కరెంటు కోసం ఎదురు చూడకుండా నీరు సులభంగా పారించుకోవచ్చు. దాని వల్ల అదనపు ఖర్చులు తగ్గుతాయి.

– ఈర్ల శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, తలమళ్ల


మరమ్మతులకు గురై మూలన పడిన నీటి పథకం


ముసిపై నిర్మించిన ఆనకట్ట

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మొక్కల తొలగింపు

మార్కాపురం టౌన్:

సాక్షి ఎఫెక్ట్..

స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తీగలకు తీగజాతి మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారిన వైనంపై గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుభ్రం చేయించడంతో విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుభ్రం చేసిన దృశ్యం

ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

గిద్దలూరు రూరల్: జైల్లో ఉంటున్న ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక సబ్ జైలును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు రికార్డులు పరిశీలించారు. విచారణ ఖైదీలకు న్యాయవాది ఉన్నారా లేదా అని ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకున్న ఖైదీలతో బాధ్యతగా ప్రవర్తించాలని జైలు సిబ్బందికి సూచించారు. వారిని చులకన భావంతో చూడరాదని చెప్పారు. వారి జీవితాన్ని మంచిగా మార్చి సమాజంలోకి పంపేలా జైలు కేంద్రాలు పనిచేయాలన్నారు.


జైలును పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్యామ్‌బాబు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

మార్కాపురం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేయడంతో లైసెన్సులు రద్దు చేస్తామని మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొన్న రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతి ఉన్న బయో మందులనే విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి షాపులో అందరికీ కనిపించే విధంగా స్టాక్ బోర్డులు, ధరల వివరాలు, రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కల్తీ మందులు అమ్మినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ మల్లికార్జున

కంభం: విద్యార్థులు చదువుకునే వయసులో గంజాయి, మద్యం, ఇతర వ్యసనాల జోలికి వెళ్లకూడదని కంభం సీఐ కె.మల్లికార్జునరావు హితబోధ చేశారు. స్థానిక వాసవి జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆడపిల్లలకు బాల్య వివాహం చేయకుండా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.రాము, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే


మార్కాపురం : పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాశయ్య తదితరులు


గిద్దలూరు : పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు

మార్కాపురం: సమాజంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక బీసీ భవన్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, రంగస్వామి గౌడ్, జీవీ సుబ్బారావు, సీహెచ్ పురుషోత్తమ్, ఎం చెంచయ్య, వెంకటయ్య, నాగం రామకృష్ణ, వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- బీసీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీసు ఆవరణలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీవీ కాశయ్య, తిరుపతయ్య, ప్రసాద్, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ మస్తానయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

గిద్దలూరురూరల్: పట్టణంలోని జ్యోతిరావు పూలే పార్కులో విగ్రహానికి స్థానిక ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్యయాదవ్, బీసీ ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యాయులు బాలగురవయ్య, ఆర్టీసీ ఉద్యోగి కటారు పోలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో అధిక వసూళ్లపై ఫిర్యాదు

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సీఎస్సీ సెంటర్, ఆధార్ కేంద్రంలో ప్రజల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు నేదరపల్లి జయరాజ్ గురువారం ఎంపీడీఓ వీరభద్రాచారికి ఫిర్యాదు చేశారు. అర్బన్ కాలనీకి చెందిన పి.చంద్రరాజు అనే విద్యార్థి సీఎస్సీ సెంటర్ వద్దకు వెళ్లగా బర్త్ సర్టిఫికెట్‌కు రూ.10 వేలు డిమాండ్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బర్త్ సర్టిఫికెట్ కోసం మీ సేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సీఎస్సీ సెంటర్‌లో ఆ సేవలు ఉండవని, అడిగినంత డబ్బు ఇస్తే సర్టిఫికెట్ ఇప్పిస్తాననడంపై విచారణ చేపట్టాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో సీఐ

బేస్తవారిపేట: పట్టణంలోని ఓ బెల్టు షాపుపై దాడి చేసి 14 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. నరేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించినా, నాటు సారా తయారు చేసినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

10 మద్యం బాటిళ్లు సీజ్

పొదిలిరూరల్: మండలంలోని సలకనూతల గ్రామంలో గురువారం రాత్రి ఓ వ్యక్తిని అరెస్టు చేసి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. గ్రామంలో ఆవుల ఫాం వద్ద తనిఖీ చేయగా 10 బాటిళ్లు లభ్యమైనట్లు చెప్పారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సునీల్ పాశ్వాన్ అనే వ్యక్తి గత పదేళ్లుగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

ఏఐ టెక్నాలజీతో ఉద్యోగావకాశాలు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

మార్కాపురం: భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని, ఈ కోర్సు చేసిన వారికి అద్భుతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని జార్జి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, సాఫ్ట్‌లైన్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధి కందుల వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం జార్జి కళాశాలలో సీఎస్‌సీ, ఏఐ, మెషిన్ లెర్నింగ్ విభాగాల్లో హైబ్రిడ్ క్లౌడ్స్ అండ్ డెవలప్స్ రెండు రోజుల వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అత్యంత కీలకమైన ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంచుకునేందుకు, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ఈ కోర్సులు ఉపయోగపడతాయన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు జి.రాఘవేంద్ర, నాగార్జున, కె.శివరంగారెడ్డి, వెంకట్ తదితరులు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీన్ మస్తానయ్య, హెచ్ఓడీ సాధునాయక్ తదితరులు ఉన్నారు.

సాగును లాభసాటిగా మార్చుకోవాలి

- వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి


పెదారికట్లలో కంది రైతులకు సూచనలిస్తున్న సంధ్యారాణి

కొనకనమిట్ల: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని వ్యయసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం సిద్ధవరం, పెదారికట్ల గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులకు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ముందస్తుగా పచ్చిరొట్ట పైర్ల కింద జీలుగలు, జనుములు సాగు చేయాలని సూచించారు. మినుము, కందిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యవంతమైన పంట, మిత్ర పురుగుల సంరక్షణ, వారం వారం పంట పరిశీలన, మొక్కల సాధారణ లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామ్మోహన్, ఏఓలు ప్రసన్న రంగలక్ష్మి, శేషమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

మార్కాపురం రూరల్: వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.రామకృష్ణ సూచించారు. ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులను గురువారం పోతలపాడులోని కెనరా బ్యాంకుకు తీసుకెళ్లారు. బ్యాంకులో ఆర్థిక లావాదేవీల గురించి మేనేజర్ సందీప్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ టూర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

లంపీ స్కిన్ వ్యాధితో ఆవు దూడ మృతి


మృతి చెందిన ఆవు దూడ

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని శ్రీకృష్ణ గోశాలలో లంపీ స్కిన్ వ్యాధితో ఆవుదూడ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మృతి చెందిన ఆవుదూడకు శాస్త్రోక్తంగా పూజలు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. గోశాల అధ్యక్షులు అప్పల శంకర్ మాట్లాడుతూ.. గోశాలలో షెడ్లు తగినన్ని లేకపోవడంతో వర్షాలకు గోవులు, దూడలు తడిశాయన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది వ్యాక్సిన్ వేసినప్పటికీ ఎనిమిది దూడలకు లంపీ స్కిన్ వ్యాధి సోకిందని, వాటిలో చిన్న దూడ మృతి చెందిందని వివరించారు.

మురుగుమయంగా మంచినీటి సంపు



పొదిలి: స్థానిక చిన్న బస్టాండ్ నుంచి దాసరిగడ్డకు వెళ్లే రోడ్డులో మంచి నీటి సంపు మురుగుమయంగా మారింది. సంపు పైకప్పు లేకపోవడంతో నీరు, చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తోంది. నీరు కూడా కలుషితమై వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంపు వాహనాల రాకపోకలకు కూడా సమస్యగా మారింది. అధికారులు స్పందించి సంపు శుభ్రం చేయించడంతోపాటు పైకప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా కార్తీక కోటి దీపోత్సవం


మాట్లాడుతున్న శివస్వామి

మార్కాపురం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి మార్కాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ సహాయ కార్యదర్శి యక్కలి రాఘవులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు, ఇమ్మడిశెట్టి చిన్న వీరారావు తదితరులు మాట్లాడారు. దీపోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. నక్షత్ర, కర్పూర హారతి ఆహూతులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


దీపాలు వెలిగిస్తున్న మహిళలు